సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం ၊ 10 ၊ జూలై ၊ 2024



గురుకులాలకు 'గ్యాస్' కష్టాలు

జీసీసీ నుంచి వంట గ్యాస్ సరఫరా నిలిచిపోవడంతో గురుకులాల్లో కొన్నిచోట్ల ఇబ్బందులు నెలకొన్నాయి. 8లో



సిరులతల్లికి పద్మారాధన

విశాఖ: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.




ఖరీఫ్ జోరు

జిల్లాలో విస్తారంగా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ సాగుకు అనుకూలించాయి. వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.

న్యూస్‌రీల్

'భూపతిపాలెం' రైతులకు శుభవార్త

- ఈనెల 15 నుంచి ఖరీఫ్‌కు నీటి విడుదల
- వర్షాలకు నిండుకుండను తలపిస్తున్న జలాశయం



భూపతిపాలెం జలాశయం

రంపచోడవరం: భూపతిపాలెం జలాశయంపై ఆధారపడిన రైతులకు ఈనెల 15 నుంచి నీటిని విడుదల చేస్తామని నీటిపారుదల శాఖ జేఈ మోహన్ తెలిపారు. ఈ ప్రాంతంలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు జలాశయం నిండుకుండను తలపిస్తోంది. పూర్తిస్థాయి నీటిమట్టం 204.00 మీటర్లు కాగా ప్రస్తుతం 203.95 మీటర్ల మేర నీరు ఉంది. ప్రాజెక్టు నిల్వ సామర్థ్యం 0.645 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.641 టీఎంసీలు ఉందని జేఈ తెలిపారు.

కుస్తీ విజేతలకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న పీవో అభిషేక్

కొయ్యూరు: తమిళనాడులోని సేలాం జిల్లా మెట్టూర్‌లో గత నెల 28,29 తేదీల్లో జరిగిన 23వ సౌత్ జోనల్ కుస్తీ పోటీల్లో బ్రాంజ్ పతకాలు సాధించిన ముగ్గురు క్రీడాకారులను పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ అభినందించారని కుస్తీ అకాడమి కోచ్ అంబటి తెలిపారు. ఈ పోటీల్లో 55 కిలోల ఫ్రీ స్టైల్ విభాగంలో పలిక బుజ్జిబాబు, 55 కిలోల గ్రీకో రోమన్ స్టైల్‌లో ముద్దూరి రమణ, 63 కిలోల విభాగంలో గంధం అశోక్ పతకాలు సాధించారని ఆయన పేర్కొన్నారు. వీరిని అభినందించిన పీవో మరింత ప్రోత్రహించేందుకు తగిన సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారని ఆయన తెలిపారు.

నేడు గిరిజన సంక్షేమశాఖ మంత్రి పర్యటన

సాక్షి,పాడేరు: రాష్ట్ర గిరిజన సంక్షేమ,స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఈనెల 10వతేదీ బుధవారం జిల్లా కేంద్రం పాడేరులో పర్యటించనున్నట్టు కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాలూరు నుంచి ఆమె రోడ్డు మార్గంలో బయలుదేరి ఉదయం 11గంటలకు కలెక్టరేట్‌లో జరిగే అధికారుల సమావేశంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. అనంతరం పాడేరు ఐటీడీఏ అతిథి గృహంలో నాయకులతో సమావేశమై సాయంత్రం 4గంటలకు విశాఖపట్నం బయలుదేరుతారని ఆయన పేర్కొన్నారు.

ఇసుక దుమారం



నక్కపల్లి డిపో వద్ద జరుగుతున్న ఇసుక విక్రయాలు

ధర వసూలు చేస్తూ.. ఉచితం అనడం సముచితమేనా? ఇదీ అసంతృప్తి, ఆగ్రహంతో ప్రజలు చేస్తున్న వ్యాఖ్య. ఫ్రీ ఇసుక అని ఊదరగొట్టి చివరకు ఇలా చేశారేమిటని రుసరుసలాడుతున్నారు. దాదాపుగా గతంలో ఉన్న చార్జీలనే ఇప్పుడూ వసూలు చేస్తున్నారు.. తేడా ఏమిటని ప్రశ్నిస్తున్నారు. దానికి తోడు ఇసుక దోపిడీ ఒకటి. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఇసుక నిల్వలు తరలిపోయాయని పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో వర్షాలు పడి తవ్వకాలు నిలిచిపోయి ఇసుక లభ్యం కాక ప్రజలు ఇబ్బంది పడ్డారు. దీంతో ఈసారి ఆ సమస్య లేకుండా ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే స్టాక్ పాయింట్ల వద్ద భారీ స్థాయిలో ఇసుక నిల్వలు అందుబాటులో ఉంచారు. ఎన్నికల ఫలితాల తర్వాత సీన్ మారిపోయింది. నెల రోజుల వ్యవధిలో రూ.5.75 కోట్ల విలువైన 56 వేల మెట్రిక్ టన్నుల **ఇసుక దోపిడీకి గురైంది. మొత్తం ఈ వ్యవహారంపై దుమారం రేగుతోంది.**

- చెప్పిందొకటి.. చేసిందొకటి
- ఉచితమంటూనే ధర వసూలు
- గతంతో పోలిస్తే దాదాపుగా అంతే ఖర్చు
- నిరాశకు లోనైన వినియోగదారులు
- మందకొడిగా కొనుగోళ్లు

నక్కపల్లి, అగనంపూడి (అనకాపల్లి/విశాఖ జిల్లా): ఉమ్మడి విశాఖ జిల్లాలో భీమిలి, అగనంపూడి, నర్సీపట్నం (గబ్బాడ), నక్కపల్లిలో ఇసుక స్టాక్ పాయింట్లు ఉన్నాయి. ఉచితం పేరుతో చేసిన ప్రచారం నమ్మిన ప్రజలు కంగు తింటున్నారు. కొనేవారు లేక ఈ డిపోలు వెలవెలబోతున్నాయి. నక్కపల్లి ఇసుక డిపో వద్ద గతంలో టన్ను ఇసుకను రూ.1,200కు విక్రయిస్తే, ప్రస్తుత ధర రూ.1,225గా నిర్ణయించారు. దీనికి రవాణా చార్జీలు అదనం. నక్కపల్లి నుంచి ట్రాక్టర్‌పై ఇసుక తరలించడానికి 5 కిలోమీటర్లు లోపయితే రూ.500, దాటితే రూ.1,000 రవాణా చార్జీ వసూలు చేస్తారు. అగనంపూడిలో గతంలో ఇసుక ధర రూ.1,400. ప్రస్తుతం రూ.1,394. కేవలం రూ.6 మాత్రమే వ్యత్యాసం. రవాణా చార్జీల్లో గతానికి, ఇప్పటికి మార్పులేదు. అగనంపూడి డిపో నుంచి గాజువాకకు ట్రాక్టర్ కిరాయి రూ.1,600. ఈ లెక్కన ట్రాక్టర్ లోడ్ ఇసుక బుక్ చేసుకుంటే గతంలో రూ.8,600 అయితే ప్రస్తుతం రూ.8,570 అవుతుంది. కేవలం రూ.30 మాత్రమే వ్యత్యాసం. లారీ లోడ్‌కు కేవలం రూ.60 మాత్రమే తక్కువ. ఈమాత్రం దానికి కొత్త ఇసుక పాలసీ అని గొప్పలు ఎందుకని విమర్శలు వినిపిస్తున్నాయి. భీమిలి ఇసుక ర్యాంపులో 50 వేల టన్నులపైనే ఇసుకను నిల్వ చేశారు. ఇక్కడ ఇసుక నిల్వల్లో ఎలాంటి తేడాల్లేవు. కూటమి ప్రభుత్వం టన్ను ఇసుక ధర రూ.758గా నిర్ణయించింది. ఈ ధర గతంలో కంటే రూ.300 తక్కువ. నర్సీపట్నంలో గత ప్రభుత్వం లక్ష టన్నుల మేర ఇసుకను నిల్వ చేసింది. ప్రస్తుతం ఇక్కడ కేవలం 48,204 టన్నుల ఇసుక మాత్రమే ఉంది. 50 వేల టన్నులకు పైనే ఇసుక మాయమైనట్లు ఆరోపణలున్నాయి. ఇదంతా ఫలితాలు వెల్లడైన నెల రోజుల్లోనే జరిగినట్లు సమాచారం. దీంతో ప్రభుత్వ ఖజానాకు రూ.5 కోట్లకు పైగా గండి పడింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తొలి నాలుగేళ్లు టన్ను ఇసుక రూ.1,250కు విక్రయించారు. చివరి ఏడాది కాంట్రాక్టర్ మారడంతో ఆ ధర రూ.1,400 చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ఇక్కడ టన్ను ఇసుక ధర రూ.1,225గా నిర్ణయించింది.

యథేచ్ఛగా దోపిడీ

ఇసుక మాఫియాకు అడ్డుకట్ట వేసేందుకు గత ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. గోదావరి, కృష్ణా, వంశధార, తుంగభద్ర నదుల్లో లభించే ఇసుకను వినియోగదారులకు నామమాత్రపు ధరలకు ప్రభుత్వమే విక్రయించేలా చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, నర్సీపట్నం ప్రాంతాల్లో ప్రత్యేకంగా డిపోలు ఏర్పాటు చేసింది. గోదావరి నది నుంచి నాణ్యమైన ఇసుకను ఇక్కడకు తరలించి ఎంపిక చేసిన ప్రైవేటు ఏజెన్సీల ద్వారా విక్రయాలు చేపట్టింది. భూగర్భ గనుల శాఖ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో ముందుగా బుక్ చేసుకున్నవారికి మాత్రమే ఇసుక సరఫరా చేసేవారు. ఈ విధానం వల్ల ఇసుక పక్కదారి పట్టకుండా ఉండటంతోపాటు ప్రభుత్వానికి కూడా ఆదాయం లభించేది. ఇలా నాలుగేళ్లపాటు ఇసుక మాఫియాపై ఉక్కుపాదం మోపి వినియోగదారులకు నాణ్యమైన ఇసుకను సరఫరా చేసింది. తాము అధికారంలోకి వస్తే నూతన ఇసుక పాలసీని అమల్లోకి తెస్తామని, ఉచితంగా సరఫరా చేస్తామంటూ టీడీపీ కూటమి ఎన్నికల ముందు వాగ్దానం చేసింది. సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు జూలై 8 నుంచి నూతన ఇసుక పాలసీ అమలు చేస్తామని కొద్దిరోజుల క్రితం ప్రకటించారు. ఉచితంగా ఇస్తున్నట్టు అధికార పక్షం ఊదరగొట్టింది. కానీ చేతల్లో మాత్రం వేరే విధంగా ఉంది. దానికి తోడు ఇసుక దోపిడీ ఒకటి. నక్కపల్లి ఇసుక డిపో వద్ద ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు 32 వేల టన్నుల ఇసుక నిల్వ చేసినట్లు అధికారిక సమాచారం. ఎన్నికల ఫలితాల తర్వాతి నుంచే ఇక్కడ ఇసుక దోపిడీ మొదలయింది. అధికారుల అండదండలతో కూటమి నేతలు ఇసుకను తరలించుకుపోయారు. ఈ నెల 2న స్థానికులు అడ్డుకోవడంతో బండారం బయటపడింది. తాజా లెక్కల్లో 6 వేల టన్నుల ఇసుక **మాయమైనట్లు అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. దీని విలువ సుమారు రూ.75 లక్షలుగా తేల్చారు. అయితే మాయమైన ఇసుక 12 వేల టన్నులకు పైనే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. నర్సీపట్నం గబ్బాడ యార్డులో కూడా పెద్ద ఎత్తున ఇసుక మాయమైందన్న ఆరోపణలున్నాయి. ఎన్నికల ఫలితాలకు** ముందు ఈ యార్డులో లక్ష టన్నుల ఇసుక ఉండేదని, ఫలితాలు వెలువడిన మరుసటి రోజే టీడీపీ నాయకులు యార్డును స్వాధీనం చేసుకున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేష్ ఆరోపించారు. లక్ష టన్నులు ఉండాల్సిన ఇసుక ప్రస్తుతం 48 వేలే ఉందని అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. యార్డులోని రూ.5 కోట్లు విలువ చేసే ఇసుకను వాహనాల్లో తరలించి టీడీపీ నాయకులు సొమ్ము చేసుకున్నారన్నారు. యార్డులోని 60 వేల టన్నుల ఇసుకను మాయం చేశారన్నారు. గబ్బాడ ఇసుక దోపిడీపై అధికారులు సమగ్రమైన విచారణ జరిపితే వాస్తవాలు బయటపడతాయంటున్నారు.



అగనంపూడి ఇసుక డిపో వద్ద ఇసుకను లారీల్లో లోడ్ చేయడానికి సిద్ధంగా ఉన్న పొక్లెయిన్

రెండో రోజు 17 టన్నులే..

నక్కపల్లి డిపోలో ఇసుక విక్రయాలు సోమవారం నుంచి ప్రారంభించారు. తొలిరోజు ఎవరూ కొనుగోలుకు ముందుకు రాలేదు. రెండో రోజైన మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కేవలం 17 టన్నుల మాత్రమే ఇసుక విక్రయాలు జరిగినట్లు తహసీల్దార్ శ్రీకాంత్ తెలిపారు. మైనింగ్, పంచాయతీరాజ్, పోలీసు, సచివాలయ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్ర వరకు డిపో వద్ద పడిగాపులు పడాల్సిన దుస్థితి ఏర్పడింది. నర్సీపట్నంలో ఇంకా విక్రయాలే ప్రారంభం కాలేదు.

ఆంధ్రా, తెలంగాణ సరిహద్దుల్లో ఇబ్బందులు

ఎటపాక:మండలంలో గుండాల 1, గుండాల–2లో ఏర్పాటుచేసిన స్టాక్ పాయింట్లలో ఇసుక అమ్మకాలు ప్రారంభమయ్యాయి. ఇవి తెలంగాణ సరిహద్దు ప్రాంతంలో ఉన్నందున ఆ రాష్ట్రానికి చెందిన రిజిస్ట్రేషన్‌తో ఉన్న వాహనాలకు ఇచ్చేందుకు గనులశాఖ అధికారులు నిరాకరిస్తున్నారు. దీనివల్ల ఆ పరిసర ప్రాంతాల లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఇదెక్కడి న్యాయం?



ఇసుక ఉచితంగా సరఫరా చేస్తామని ఓట్లేయించుకున్నారు.. తీరా అధికారంలోకి వచ్చాక మరో విధంగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. నక్కపల్లి డిపో నుంచి టన్ను రూ.1225లకు కొనుక్కోవాలని ప్రభుత్వం చెబుతోంది. ఇదెక్కడి న్యాయం? గత ప్రభుత్వంలోనే టన్ను రూ.1200లకు విక్రయించారు. ఇప్పుడు ఫ్రీగా ఇవ్వకపోగా గతంలో కంటే టన్నుకు రూ.25 లు అధికంగా వసూలు చేయడం భావ్యం కాదు. ఉచితంగా ఇస్తారని నమ్మి చాలామంది ఇంటి నిర్మాణ పనులు ఆరు మాసాలు వాయిదా వేసుకున్నారు. తీరా ఇప్పుడు డబ్బులు కట్టి తీసుకెళ్లాలంటున్నారు. నేను ఈరోజు 5 టన్నులు రూ.6,125లకు కొనుగోలు చేశాను. దీనికి రవాణా చార్జీలు వెయ్యి రూపాయలు అదనం.

–ఇసరపు శ్రీను, వినియోగదారుడు, పెనుగొల్లు, అనకాపల్లి జిల్లా

ఉచితం అంటే ఇదేనా...

ఉచితమని ఊరించారు. తీరా ఇసుక విధానం ప్రకటించిన తరువాత అసలు విషయం బోధపడింది. గతానికి భిన్నంగా ధరలు ఉంటాయనుకున్నాం. ఇంతలా భవన నిర్మాణదారులు, తాపీ పనివారిని మోసం చేస్తారనుకోలేదు. తూర్పుగోదావరి జిల్లాలోని ర్యాంప్‌ల నుంచి ఇసుక అగనంపూడి డిపోకు తరలించడానికి టన్నుకు రూ.1396 వ్యయం అవుతుందంటే నమ్మశక్యంగా లేదు. కేవలం రవాణా చార్జీలే వసూలు చేస్తే ఇంత మొత్తం అవసరం లేదు. ప్రభుత్వం పునరాలోచించాలి.

–పి.పి.రామారావు, భవన నిర్మాణ కాంట్రాక్టర్, రాజీవ్‌నగర్, గాజువాక

నాలుగేళ్ల బాలికపై లైంగిక దాడికి యత్నం

పోక్సో కేసు నమోదు

ఎటపాక: మండలంలోని గౌరిదేవిపేట గ్రామంలో ఓ నాలుగేళ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నించిన వ్యక్తిపై స్థానిక పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గౌరిదేవిపేట గ్రామానికి చెందిన అమరవరపు రాము (56) అనే వ్యక్తి ఆదివారం ఉదయం తన ఇంటి పక్కన ఉన్న నాలుగేళ్ల చిన్నారిని చాక్లెట్లు ఇస్తారమ్మని పిలిచాడు. ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. జరిగిన విషయాన్ని చిన్నారి తల్లిదండ్రులకు తెలిపింది. రెండు రోజులుగా ఆమెకు జ్వరం రావడంతో పోలీసులకు మంగళవారం తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. వెంటనే నిందితుడు రామును సీఐ రామారావు, ఎస్‌ఐ పార్థసారథి అదుపులోకి తీసుకున్నారు. వెంటనే అతనిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

ఘనంగా నిత్య కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు.



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

గంజాయి నిర్మూలనపై దృష్టి పెట్టండి

- ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలి
- ఉపాధి కార్యక్రమాలపై విస్తృతంగా ప్రచారం
- కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పక్కన జేసీ భావన వశిష్ఠ, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్

సాక్షి,పాడేరు: ప్రత్యామ్నాయ పంటల సాగుతోనే గంజాయి నిర్మూలన సాధ్యమని, తద్వారా యువత తప్పుదోవ పట్టకుండా చర్యలు చేపట్టవచ్చని కలెక్టర్ దినేష్‌కుమార్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో గంజాయి నిర్మూలనపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి నిర్మూలన, ప్రత్యామ్నాయ పంటల సాగు, ఉపాధి కార్యక్రమాలపై ఏజెన్సీ వ్యాప్తంగా విస్తృత ప్రచారం చేయాలని ఆయన సూచించారు. కళాశాలల స్థాయిలోను గంజాయి నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. అటవీ భూములు, ఇతర ప్రాంతాల్లో గంజాయి సాగు చేసే గిరిజనుల వివరాలు సేకరించి వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలను విస్తృతం చేసి గంజాయి రవాణాను అరికట్టాలని సూచించారు. వ్యవసాయ, అనుబంధశాఖలన్నీ ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. సూక్ష్మ పరిశ్రమలను ప్రోత్సహించి 35 శాతం రాయితీపై రుణాలు మంజూరు చేయాలని సూచించారు.

7500 ఎకరాల్లో గంజాయి తోటలు ధ్వంసం: ఎస్పీ తుహిన్ సిన్హా

జిల్లాలో అపరేషన్ పరివర్తన కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 7,500 ఎకరాలలో గంజాయి తోటలను పోలీసుశాఖ ధ్వంసం చేసిందని ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. వర్చువల్ విధానంలో ఆయన మాట్లాడుతూ అపరేషన్ పరివర్తన ద్వారా గంజాయి సాగు చేసే గిరిజనుల్లో అనేక మార్పులు తీసుకువచ్చామని తెలిపారు. గంజాయి సాగు చేసే రైతులపై కేసులు నమోదు చేయడంతో పాటు వారిని ప్రత్యామ్నాయ పంటల సాగుపై మళ్లించి ఉచితంగా విత్తనాలు,పండ్ల జాతుల మొక్కలు అందజేశామన్నారు. వారికి ఉపాధి రంగాల్లోను శిక్షణ ఇచ్చామని తెలిపారు. గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించే విధంగా సిల్వర్ ఓక్ మొక్కలు, కాఫీతోటల పెంపకంపై గిరిజనులకు ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జేసీ భావన వశిష్ఠ, ఐటీడీఏ పీవో అభిషేక్, డీఎఫ్‌వో వినోద్‌కుమార్, ఎస్‌ఈబీ డీఎస్పీ శ్రీనివాసరావు, డీఆర్వో పద్మావతి, డీఆర్‌డీఏ పీడీ మురళి, డీఈవో బ్రహ్మాజీరావు పాల్గొన్నారు.

పొంగిన వాగులు..
స్తంభించిన రాకపోకలు

జిల్లావ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఒడిశాలో కురుస్తున్న గెడ్డల్లో వరదనీరు భారీగా చేరడంతో ముంచంగిపుట్టు మండలంలోని లక్ష్మీపురం, బుంగాపుట్టు పంచాయతీలకు చెందిన 24 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. గెడ్డలు నీరు ముంచెత్తడంతో లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామం జలదిగ్బంధంలో ఉంది.

- విస్తారంగా భారీ వర్షాలు
- ముంచంగిపుట్టు మండలంలో ఉధృతంగా గెడ్డలు
- 24 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- జలదిగ్బంధంలో దొరగూడ
- జిల్లాలో 247.8 ఎంఎం వర్షపాతం



రాజవొమ్మంగి మండలం తంటికొండలో వీధులు, ఇళ్లల్లోకి చేరిన వరదనీరు



పెదబయలులో మెయిన్ రోడ్డును ఆనుకుని నిలిచిపోయిన వర్షం నీరు

సాక్షి, పాడేరు: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పాడేరు డివిజన్ పరిధిలోని అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ, హుకుంపేట, జి.మాడుగుల, చింతపల్లి, జీకే వీధి, కొయ్యూరు, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జోలాపుట్టు జలాశయానికి ప్రధాన ఆధారమైన మత్స్యగెడ్డ నిండుగా ప్రవహిస్తోంది. రంపచోడవరం డివిజన్ పరిధిలోని సోకిలేరు వాగు ఉధృంగా ఉంది. శబరి, గోదావరిలో కొత్తనీరు చేరుతోంది. జిల్లా వ్యాప్తంగా మంగళవారం 247.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ దినేష్‌కుమార్ అప్రమత్తం చేశారు. ఇలావుండగా ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఖరీఫ్ సాగుకు ఎంతో ఉపయోగమని వ్యవసాయశాఖ తెలిపింది. గిరిజన రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

24 గ్రామాలకు...

ముంచంగిపుట్టు: వారం రోజులుగా మండలంతో పాటు సరిహద్దు ఒడిశా రాష్ట్రంలోను కురుస్తున్న భారీ వర్షాలకు లక్ష్మీపురం నుంచి బుంగాపుట్టు వెళ్లే మార్గంలో ముంతగుమ్మి, బిర్రిగూడ, ఉబ్బెంగుల, దొరగూడ, కర్లాపోదర్ గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో లక్ష్మీపురం, బుంగాపుట్టు పంచాయితీలకు చెందిన 24 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. నిత్యావసర సరుకులు, అత్యవసర పనుల నిమిత్తం ఉధృతంగా ప్రవహిస్తున్న గెడ్డలను దాటుకొని లక్ష్మీపురం వచ్చారు. దొరగూడ గ్రామ గిరిజనులు ప్రాణాలకు తెగించి ద్విచక్ర వాహనాలను మోసుకొని ఉధృతంగా ప్రవహిస్తున్న ఉబ్బెంగుల వాగును అతి కష్టం మీద దాటించారు. లక్ష్మీపురం పంచాయతీ దొరగూడ గ్రామం కొండ గెడ్డలు ముంచెత్తడంతో జలదిగ్బంధంలో ఉంది. జర్రెలకు వెళ్లే రహదారి బురదమయంగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.వర్షం కారణంగా బూసిపుట్టు వారపు సంతకు కొనుగోలుదారులు రాలేదు.

రాజవొమ్మంగి: మండలంలో మంగళవారం మూడు గంటల పాటు కురిసిన భారీ వర్షానికి జనజీవనం స్తంభించింది. తంటికొండ గ్రామంలో వరద నీరు ఇళ్లలోకి చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఇక్కడ గ్రామం కంటె 12 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న ఎన్‌హెచ్ 516ఈ రహదారి ఈ దుస్థితికి కారణమని వారు తెలిపారు. కాసేపు ప్రధాన రహదారిపై రాకపోకలను అడ్డుకున్నారు. దీంతో రోడ్డు నిర్మాణసంస్థ సిబ్బంది నీరు పోయేలా తూరలు ఏర్పాటుచేశారు. సుమారు మూడు గంటల పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఇదే మార్గంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద భారీ వృక్షం కూలడంతో రాకపోకలుకు ఇబ్బంది ఏర్పడింది. కొండవాగులు ఉప్పొంగడంతో అప్పలరాజుపేట వద్ద వట్టిగెడ్డ జలాశయంలోకి భారీగా వరద నీరు చేరడంతో నీటి మట్టం గణనీయంగా పెరుగుతోంది. సాగునీరు పుష్కలంగా అందుబాటులో ఉండటంతో వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి.

కొయ్యూరు: మండలంలో మంగళవారం కురిసిన భారీ వర్షానికి కాకరపాడు, కొయ్యూరు, గొట్లుపాడు ప్రాంతాల్లో కాలువలు ఉధృతంగా ప్రవహించాయి. గొట్లుపాడు కాలువపై వంతెన లేకపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



రాజవొమ్మంగి మండలంలో నీటి నిల్వలతో కళకళలాడుతున్న వట్టిగెడ్డ జలాశయం



రాజవొమ్మంగిలో ప్రధాన రహదారిపై కూలిన చెట్టు



వర్షాలకు పెరుగుతున్న మత్స్యగెడ్డ ప్రవాహం



పాడేరులో కురుస్తున్న వర్షం



ముంచంగిపుట్టు: ఉబ్బెంగుల వాగును ద్విచక్ర వాహనాన్ని మోసుకుని దాటిస్తున్న దొరగూడ గిరిజనుడు

క్లుప్తంగా

11న డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలు

చింతపల్లి రూరల్: వాయిదా పడిన డిగ్రీ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 11న నిర్వహించనున్నట్టు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయభారతి మంగళవారం తెలిపారు. ఈ నెల 4వ తేదీన నిర్వహించవలసిన రెండవ సెమ్ సప్లిమెంటరీ పరీక్షలను విద్యా సంస్థల బంద్ కారణంగా వాయిదా వేసినట్టు చెప్పారు.

రేషన్ దుకాణాల్లో తనిఖీలు



శరభవరంలో ధరల పట్టీని పరిశీలిస్తున్న తహహసీల్దార్

రాజవొమ్మంగి: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలవ్యాప్తంగా గల రేషన్ దుకాణాల్లో ఓ వైపు గిరిజన సహకార కార్పొరేషన్ విజిలెన్స్ అధికారులు, మరోవైపు రెవెన్యూ అధికారులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ ఎ.ఎస్.వి.సత్యనారాయణ, మరో వైపు డిప్యూటీ తహసీల్దార్ ఎ.సత్యనారాయణ మండలంలోని పలు రేషన్‌షాపుల్లో సరకు నిల్వలను తనిఖీ చేశారు. డీలర్లు అన్ని విషయాల్లో తగిన జాగ్రత్తలు పాటించాలని, ఎటువంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



చంటి దొర (ఫైల్)

మారేడుమిల్లి: మండలంలో సున్నంపాడు గ్రామ సమీపం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ రాము వివరాల ప్రకారం... స్థానిక సంత మార్కెట్‌లో దొరల వీధికి చెందిన వీకా చంటిదొర (33) సోమవారం రాత్రి రంపచోడవరం వెళ్లి తిరిగి వస్తుండగా, మండలంలోని సున్నంపాడు గ్రామ సమీపాన దూదిపూడి జంక్షన్ వద్ద మలుపులో కల్వర్టును ఢీకొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మంగళవారం తెల్లవారుజామున స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రంపచోడవరం తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



సెల్లూంలో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర

ముంచంగిపుట్టు: గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పనే లక్ష్యమని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అన్నారు. మండలంలోని ఏనుగురాయి పంచాయితీ సెల్లూం గ్రామంలో జెడ్పీ నిధులు రూ.5లక్షలతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన గ్రామాల్లో విస్తృతంగా పర్యటించడమే కాకుండా స్థానిక గిరిజనుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభు త్వం చాలా గ్రామాల్లో తాగునీరు, సీసీ, బీటీ రోడ్లు నిర్మించి గిరిజనుల కష్టాలు తీర్చిందన్నారు. రానున్న రోజుల్లో జెడ్పీ నిధులతో గిరిజన ప్రాంత అభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఆమె అన్నారు. అనంతరం గ్రామంలో గిరిజనుల సమస్యలను ఆమె తెలుసుకున్నారు. సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీలు సుబ్బలక్ష్మి, కమల, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు పద్మారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జగబంధు, నేతలు సన్యాసిరావు, తిరుపతి, మూర్తి పాల్గొన్నారు.

కలెక్టర్‌కు రిటైర్డ్ ఉద్యోగుల సత్కారం



కలెక్టర్ దినేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు

సాక్షి,పాడేరు: కలెక్టర్ దినేష్‌కుమార్‌ను పాడేరు తాలుకా రిటైర్డ్ ఉద్యోగుల సంఘ ప్రతినిధులు మంగళవారం కలెక్టరేట్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘ ప్రతినిధి రొబ్బా నాగభూషణరాజు ఆధ్వర్యంలో ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. తమ సమస్యలను ఆయనకు విన్నవించారు.

ప్రతి నెలా ఉద్యోగుల సమస్యల పరిష్కార వేదిక

ప్రతి నెలలో చివరి శుక్రవారం ఉద్యోగుల సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్నిశాఖల అధికారులకు సర్క్యులర్ జారీ చేస్తున్నామని, ఈమేరకు వారి దిగువ ఉద్యోగులు, సిబ్బందికి సమాచారం చేరవేయాలని ఆయన ఆదేశించారు. ప్రతి నెలలో చివరి శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు పాడేరు కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని ఉద్యోగులంతా సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

బొత్సకు అరకు ఎంపీ శుభాకాంక్షలు

మహారాణిపేట (విశాఖ): మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ జన్మదినం పురస్కరించుకొని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి సిరిపురంలోని బొత్స నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అరకు ఎంపీని అభినందించారు. ఇటీవల పార్లమెంటు మొదటి సమావేశాల్లో ఆమె మాట్లాడిన విధానాన్ని బొత్స ప్రశంసించారు.



బొత్సను అభినందిస్తున్న అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి

మాదక ద్రవ్యాల పట్టివేత

విశాఖ సిటీ: మాదక ద్రవ్యాలు తరలిస్తున్న ముఠాకు టాస్క్‌ఫోర్ పోలీసులు చెక్‌పెట్టారు. గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక గ్రాము ఎండీఎంఏ, 3 లీటర్ల లిక్విడ్ గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అయితే మూడురోజుల క్రితమే పోలీసులు నిందితులను పట్టు కున్నప్పటికీ.. ఆ విషయాన్ని ఇప్పటి వరకు బయటపెట్టలేదు.గోప్యంగా దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయవర్గాల సమాచారం మేరకు.. విశాఖ మీదు గా డ్రగ్స్ తరలిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. దీంతో వారు గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో మూడు రోజుల క్రితం నిఘా పెట్టారు. తంగేటి భరత్, రామ్ ప్రసాద్, శ్యాంసుందర్, గుర్రపు యశ్వంత్‌లను పట్టుకున్నారు. వీరిలో భరత్, రామ్‌ప్రసాద్‌లు పాత నేరస్తులు. గతంలో పలుమార్లు ఇదే తరహా కేసుల్లో అరెస్టయ్యారు. వీరి వద్ద ఒక గ్రాము ఎండీఎంఏ, 3 లీటర్ల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎండీఎంఏను కేరళ నుంచి, లిక్విడ్ గంజాయిని పాడేరు నుంచి సేకరించినట్లు పోలీసుల వి చారణలో అంగీకరించినట్లు సమాచారం. ఈకేసును పోలీసులు గోప్యంగా దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్ఈబీ కానిస్టేబుల్ మృతి



ఘటనాస్థలంలో చాంద్‌బాషా మృతదేహం

చింతూరు : మారేడుమిల్లి, చింతూరు ఘాట్‌రోడ్‌లో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతూరు ఎస్ఈబీ స్టేషన్లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎండీ చాంద్‌బాషా(52) మృతిచెందారు. తులసిపాక సమీపంలో ఘాట్‌రోడ్‌లో గల వ్యూపాయింట్ వద్ద రహదారి పక్కన చాంద్‌బాషా మృతదేహం పడివుండడాన్ని గమనించిన ప్రయాణికులు 108కు సమాచారమివ్వడంతో విషయం తెలిసింది. కాగా చింతూరు నుంచి విధుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై మారేడుమిల్లి వైపు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు ఎస్ఈబీ ఎస్‌ఐ ప్రసాద్ తెలిపారు. మృతిచెందిన చాంద్‌బాషా కాకినాడకు చెందిన వారని ఆయన తెలిపారు.

పిడుగుపాటుకు దుక్కిటెద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

ఎటపాక: మండలంలోని పురుషోత్తపట్నంలో పిడుగుపాటుకు దామెర్ల రామకృష్ణ అనే రైతుకు చెందిన ఎద్దు మృతి చెందింది. పశుగ్రాసం మేస్తున్న ఎద్దుపై పిడుగుపడటంతో సంఘటన స్థలంలోనే మృతి చెందింది. దీని విలువ రూ.30 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు.

పారదర్శకంగా ఉపాధి హామీ పనులు

జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ శివయ్య

అడ్డతీగల: గ్రామస్థాయిలో నిర్వహించే ఉపాధి హామీ పనులను పూర్తి పారదర్శకతతో ప్రభుత్వ నిబంధనలు మేరకు జరపాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎం.శివయ్య అన్నారు. అడ్డతీగలలో మంగళవారం నిర్వహించిన ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ అనుబంధ పనులతో పాటు ఉద్యాన వన పంటల పెంపకం వంటివి విరివిగా చేపట్టాలని సూచించారు. నీటి వనరుల వృద్ధికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. పుంత రోడ్లు,వీధుల్లో సీసీ రోడ్లు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తే పరిశీలించి అనుమతులు మంజూరుచేస్తామని తెలిపారు.ప్రతి వేతనదారునికి పని కల్పించాలని, లక్ష్యం మేరకు పనిదినాలు పూర్తి చేయాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా మేట్‌లు క్షేత్రస్థాయిలో పనులు చేయిస్తున్నదీ లేనిదీ ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులు పర్యవేక్షణ జరపాలని సూచించారు.

ఉపాధి హామీ పథకం సిబ్బందికి జరిమానా

అడ్డతీగల మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో రూ.15.36 కోట్ల విలువైన పనులను 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకూ చేయించినట్టు చెప్పారు. సామాజిక తనిఖీ బృందాలు గ్రామాల వారీగా ఆయా పనులను తనిఖీ చేసినట్టు తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా పనులు నిర్వహించని కారణంగా మండలవ్యాప్తంగా ఉపాధి హామీ పథకం సిబ్బందికి రూ.52 వేలు జరిమానా విధించామన్నారు.దానిలో రూ.8,993 నగదును సిబ్బంది చెల్లించారని చెప్పారు.ఈ ప్రజావేదికలో అదనపు జిల్లా విజిలెన్స్ అధికారి ఎ.వెంకటేశ్వరరావు,సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పీ సీహెచ్.రాజు, ఎంపీడీవో కె.రంగారావు, ఏపీవోలు అరవాలు,మణికుమారి.జి.చిరంజీవిబాబు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ బృందాల నుంచి వివరాలు తెలుసుకుంటున్న జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ శివయ్య, ఇతర అధికారులు

పాముకాటుతో గిరిజన రైతు మృతి

పాడేరు : పాము కాటేయడంతో ఓ గిరిజన రైతు మృతిచెందాడు. జి.మాడుగుల మండలం వంతాల పంచాయతీ చింతగొందిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. చింతగొంది గ్రామానికి చెందిన ఐసరం మత్స్యరాజు(38) అనే గిరిజన రైతు తన నివాసంలోని వరండాలో నిద్రపోయాడు. మంగళవారం తెల్లవారుజామున వ్యవసాయ పనులకు సిద్ధమవుతున్న సమయంలో అతనిని పాము కాటేసింది. తీవ్ర అస్వస్థతకు గురైన మత్స్యరాజును కుటుంబ సభ్యులు పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరరాజు జిల్లా ఆస్పత్రికి చేరుకుని సంఘటన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహం వద్ద నివాళులు అర్పించారు. మత్స్యరాజు కుటుంబ సభ్యులను ఓదార్చారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

ఉత్తమ సేవలతోనే గుర్తింపు

- పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి
- ఎస్ఈ ప్రశాంతకుమార్‌కు వీడ్కోలు సత్కారం



ఎస్ఈ ప్రశాంత్‌కుమార్‌ను సన్మానిస్తున్న అధికారులు

సీలేరు: ఉత్తమ సేవలతోనే గుర్తింపు లభిస్తుందని, ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్‌లో రెండున్నరేళ్లుగా ఎస్ఈగా పనిచేసిన ప్రశాంత్‌కుమార్ సేవలు ప్రశంసనీయమని పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. బదిలీపై వెళ్తున్న ఆయనను మంగళవారం సాయంత్రం స్థానిక కల్యాణ మండపంలో సత్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ క్లిష్ట పరిస్థితుల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సమర్థవంతంగా చర్యలు చేపట్టారన్నారు. ఈఈ వరప్రసాద్ మాట్లాడుతూ నిత్యం సిబ్బంది నుంచి ఇంజినీర్ల వరకూ అందరితో స్నేహపూర్వకంగా ఉంటూ అందరితో మంచిపేరు సంపాదించుకున్నారని అన్నారు. అనంతరం ఎస్ఈ కేకేవీ ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ కాంప్లెక్స్‌లో ఇంజినీర్లు, కార్మికులు సహకారంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా విధులు నిర్వహించానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ (ఓఅండ్ఎం)ఎస్.ఎస్ మీరా, ఈఈలు ప్రభాకర్, విజయ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, బాలకృష్ణ పాల్గొన్నారు.

పెదబయలులో భిన్న వాతావరణం



పెదబయలులో ఉదయం దట్టంగా కురుస్తున్న మంచు



పెదబయలులో మధ్యాహ్నం కురుస్తున్న వర్షం

పెదబయలు: మండల కేంద్రంలో మంగళవారం భిన్న వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. ఉదయం మంచు దట్టంగా కురిసింది. మధ్యాహ్నం భానుడు చుర్రుమనిపించాడు. ఆ తరువాత 2.30 గంటల నుంచి ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మండల కేంద్రంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపై నిలిచిపోయిన నీరు చెరువులను తలపించింది.

గురుకులాలకు 'గ్యాస్' కష్టాలు

- జీసీసీ లావాదేవీల స్తంభనతో వంట గ్యాస్ సరఫరాపై ప్రభావం
- కొన్నిచోట్ల సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన పాడేరు ఐటీడీఏ
- మిగతా వాటికి సరఫరా చేయాలని పలువురి వినతి

కొయ్యూరు: గిరిజన సహకార సంస్థ ఆర్థిక లావాదేవీలను ఆదాయ పన్నుశాఖ స్తంభింపజేయడంతో దాని ప్రభావం గురుకులాలపై పడింది. వీటికి ఆ సంస్థ నుంచి వంట గ్యాస్ సరఫరా నిలిచిపోయింది. వీటిలో కొన్నింటికి సరఫరా చేసేందుకు పాడేరు ఐటీడీఏ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. అయితే చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు, పెదబయలు మండలాల్లో గురుకులాల ప్రిన్సిపాళ్లు ఎప్పటికప్పుడు సొంత నగదుతో కొనుగోలు చేయాల్సి వస్తోంది. పాడేరు డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో 11 గురుకుల పాఠశాలలు, మరో 11 గురుకుల కళాశాలలు, 11 ఏకలవ్య పాఠశాలలు ఉన్నాయి. వంట గ్యాస్ సిలెండర్ ధర రూ 915 కాగా విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలకు రోజుకు రెండున్నర, కళాశాలకు ఒకటిన్నర చొప్పున వంట గ్యాస్ సిలెండర్లు అవసరం. దీని ప్రకారం గురుకుల పాఠశాలకు రోజుకు రూ.2,300, గురుకుల కళాశాలకు రూ.1,600 చొప్పున ఖర్చవుతోంది. తొలుత నుంచి గురుకుల విద్యాలయాలకు జీసీసీ ద్వారా సరకులతోపాటు వంట గ్యాస్ కూడా సరఫరా అవుతోంది. గ్యాస్‌ను అరువు ప్రాతిపదికన సరఫరా చేసిన గిరిజన సహకార సంస్థ డైట్ బిల్లులు మంజూరు అయిన వెంటనే ఆ నిధులను జమ చేసుకునేది. అప్పటివరకు సొంత నిధులు చెల్లించి హెచ్‌పీసీఎల్ నుంచి వంట గ్యాస్ తీసుకునేది. ఈ కారణంగా జీసీసీ నుంచి వంట గ్యాస్ సరఫరా నిలిచిపోయింది. దీనిపై స్పందించిన పాడేరు ఐటీడీఏ కొన్ని గురుకులాలకు మాత్రమే గ్యాస్‌సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది. చింతపల్లి, జీకేవీధి, కొయ్యూరు, పెదబయలు మండలాల్లోని 12 గురుకుల పాఠశాలలు, కళాశాలలు, ఏకలవ్య పాఠశాలల ప్రిన్సిపాళ్లు మాత్రం ఎప్పటికప్పుడు సొంత నగదుతో కొనుగోలు చేస్తున్నారు. వీరికి కూడా పాడేరు ఐటీడీఏ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వంట గ్యాస్‌ను సరఫరా చేయాలని పలువురు కోరుతున్నారు. దీనిపై పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్‌ను వివరణ కోరగా ఇప్పటికే కొన్నింటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని, మిగతా వాటికి సరఫరాకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

న్యాయస్థానాన్ని ఆశ్రయించాం

గిరిజన సహకార సంస్థ ఖాతాలను తనిఖీ చేసిన ఆదాయ పన్ను శాఖ లావాదేవీలను స్తంభింపజేసింది. దీనివల్ల గురుకులాలకు వంట గ్యాస్‌ను సరఫరా నిలిచిపోయింది. ఈ పరిస్థితుల్లో ఖాతాలపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించాం. ఈ మేరకు ఆదేశాలు ఇస్తే గురుకులాలకు గ్యాస్ సరఫరా చేసేందుకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. ఈ సమస్య త్వరగా పరిష్కారం అవుతుందని ఆశిస్తున్నాం.

– దేవరాజ్, డీఎం, జీసీసీ, చింతపల్లి

అదృశ్యమైన వివాహితను పట్టుకున్న పోలీసులు

భార్యాభర్తలకు తహసీల్దార్ కౌన్సెలింగ్



భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

చింతపల్లి రూరల్: అదృశ్యమైన వివాహిత ఆచూకీని చింతపల్లి పోలీసులు కనుక్కొని మంగళవారం స్థానిక తహసీల్దార్ టి.రామకృష్ణ వద్ద హాజరుపరిచారు. ఈ మేరకు భార్యాభర్తలకు తహసీల్దార్ సమక్షంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. తమ మధ్య నెలకొన్న విభేదాలతోనే ఇంటి నుంచి వెళ్లిపోయనట్లు బాధితురాలు పి. రజిని తెలిపింది. మండలంలో కొమ్మంగి పంచాయతీకి చెందిన ఆమెతో రవిరింతాడ గ్రామానికి చెందిన పి.జయరాజ్‌కు పదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ నేపథ్యంలో తన భార్యకు వివాహేతర సంబంధం ఉందని అనుమానంతో నాలుగు సంవత్సరాల నుంచి జయరాజ్ తాగి వచ్చి వేధిస్తున్నాడు. దాంతో మనస్తాపానికి గురైన రజిని గత నెల 2న హుకుంపేట మండలం కామయ్యపేట గ్రామంలో తన స్నేహితురాలి ఇంటికి వెళ్లిపోయింది. దాంతో భార్య కనిపించడం లేదని ఆమె భర్త చింతపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు ఆమెను పట్టుకుని తహసీల్దార్ సమక్షంలో హాజరుపరచగా భార్యాభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

టాటా మ్యాజిక్ వాహనం బోల్తా

ఐదుగురికి తీవ్ర గాయాలు



తలకు తీవ్ర గాయమైన రాములమ్మ



ఘటనలో రెండు చేతులకు గాయాలైన లాలమ్మ

చింతూరు: మండలంలోని ఎ.జి.కొడేరు వద్ద మంగళవారం టాటా మ్యాజిక్ వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎ.జి.కొడేరుకు చెందిన కొంతమంది తెలంగాణలోని భద్రాద్రి జిల్లా రామారావుపేటలో దినకార్యం నిమిత్తం మూడు వాహనాల్లో బయలుదేరారు. ఈ నేపథ్యంలో బయలుదేరిన కొద్దిసేపటికే గ్రామ సమీపంలో మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. దీనిలో ప్రయాణిస్తున్న ఎ.జి.కొడేరుకు చెందిన మడకం లాలమ్మ, ధర్ముల జయమ్మ, అగరం పెంటమ్మ, సగ్గా రాములమ్మతోపాటు లక్కవరానికి చెందిన డ్రైవర్ మూట భీమయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. వీరికి స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు.

నూతలగుంటపాలెంలో దొంగలు పడ్డారు

- ఒకే రోజు రాత్రి 9 ఇళ్లలో ప్రవేశించిన దొంగలు

కశింకోట: మండలంలోని నూతలగుంటపాలెంలో ఒకే రాత్రి 9 ఇళ్లలో దొంగతనాలు జరుగగా, ఒక ఇంట్లో మాత్రం తులంన్నర బంగారం, రూ.20 వేల నగదు తస్కరణకు గురైంది. తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని అగంతకులు దొంగతనాలకు పాల్పడ్డారు. ఇళ్లలో ప్రవేశించి సామాన్లను చిందర వందర చేశారు. విషయం తెలియడంతో స్థానికులు ఉలిక్కి పడ్డారు. అనకాపల్లి-యలమంచిలి మార్గంలో జాతీయ రహదారి పక్కనున్న ఈ గ్రామంలో తాళాలు వేసి ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయిన 9 ఇళ్లను దొంగలు గుర్తించారు. వాటి తాళాలు పగులగొట్టి ఇళ్లలోకి ప్రవేశించారు. బీరువాలు తెరిచి అందులోని వస్త్రాలను చిందర వందర చేశారు. ఎస్సీ కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ పిల్లి సుందరరావుకు చెందిన ఇంట్లో తప్ప మిగిలిన ఇళ్లలో ఎటువంటి నగదు, బంగారం చోరీకి గురవలేదు. సుందరరావు ఆదివారం ఇంటికి తాళం వేసి విశాఖ వెళ్లారు. మంగళవారం ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉండటం గమనించారు. బీరువాలో వస్త్రాలు చిందర వందరగా పడి ఉండటాన్ని చూసి, అరలు పరిశీలించగా తులంన్నర బంగారు ఆభరణాలతోపాటు రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయనతోపాటు కలిగెట్ల మహాలక్ష్మినాయుడు, కోరుకొండ మారయ్య, బొండా నారాయణమూర్తి, అగ్రహారపు శ్రీనివాసరావు, చిక్కాల రమణమ్మ, చిక్కాల రమణ, కలం గైరమ్మ, కారెడ్డి చిన్నమ్ములు ఇళ్లకు తాళాలు వేసి సొంత పనుల మీద, బంధువుల ఇళ్లకు, తీర్థ యాత్రలకు వెళ్లడంతో, వారి ఇళ్ల తాళాలనూ కోసి, దొంగతనానికి ప్రయత్నించారు. వీరిలో చిన్నమ్ములు షిర్డి వెళ్లి మంగళవారమే తిరిగి వచ్చి, పరిశీలించగా ఇంటిలో దొంగలు పడిన సంగతి గుర్తించారు. ఎటువంటి వస్తువులు పోలేదని తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ ఎం.వినోద్‌బాబు, ఎస్‌ఐ రమేష్‌బాబు సందర్శించారు. సుందరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



దొంగలు బీరువాలో చిందర వందర చేసిన వస్త్రాలు